కంటోన్మెంట్ రెండో వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ యాసీన్ బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. కంటోన్మెంట్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లుగా తెలిపారు.

- బొల్లారం

ప్రజా పాలన కాదు.. పీడించే పాలన

అడ్డగుట్ట, : కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదు.. ప్రజలను పీడించే పాలన అని బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్ గౌడ్ (పెద్దన్న) బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రజలకు పాట్లు తప్పా.. మిగిలేది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరీక్షలను నిర్వహించిన వాటికి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నియమక పత్రాలు అందజేసి మా ప్రభుత్వమే ఉద్యోగాలిచ్చిందని చెప్పుకోవడం సిగ్గు చేటు అని అన్నారు. కులగణన , మూసీ సుందరీకరణతో ప్రజలకు ఉపయోగం లేదన్నారు. రైతు బంధు ఇస్తామని చెప్పి.. ప్రస్తుతం ఊసే ఎత్తడం లేదని, ఐటీరంగం పూర్తిగా కుదేలైందని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడం లేదని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బేగంపేట్, డిసెంబర్ 1: కన్జూమర్ గ్రీవెన్సెస్ సమావేశాన్ని ప్యారడైజ్ విద్యుత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 : 30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నామని ప్యారడైజ్ విద్యుత్ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్, టెక్నికల్ సభ్యులు, ఫైనాన్స్ సభ్యులు, కన్జూమర్ ఎఫైర్స్ హాజరవుతారని తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు.. ట్రాఫిక్ ఇక్కట్లు

అల్ఫాహోటల్, స్టేషన్ రోడ్డులో రోడ్డుపై నడవలేకుండా పూర్తిగా ఆటోలను పార్కింగ్ చేసిన దృశ్యాలు

రోడ్డుపై షాపులకు ఎదురుగా ఆటోలను పార్కింగ్ చేసిన దృశ్యాలు

బేగంపేట్ : లష్కర్‌లో రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఆటో వాలాలు, పుత్‌పాత్‌పై వ్యాపారం చేసే వ్యాపారులు యధేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ఫుట్‌పాత్, రోడ్లపైన వ్యాపారాలు చేసుకున్నా..రోడ్లపై ఆటోలు, కార్లు నిలిపిన అగిడే నాథుడు లేడు. ఉన్నా.. ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు కానరారు. సికింద్రాబాద్ అల్ఫాహోటల్ నుంచి.. రాష్ట్రపతి రోడ్డు బాటా చౌరస్తా వరకు పాదచారులు, వాహనాలు నడవలేని విధంగా ఆక్రమిస్తున్నారు. ట్రాఫిక్ అధికారులు కన్నెత్తి చూడరు.

ట్రాఫిక్ పోలీసులకు మామూళ్లు అందుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇస్తే చాలు ఇక ఎక్కడైనా ఫుట్‌పాతైనా, రోడ్డులో మధ్యలోనైనా వ్యాపారం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేస్తూ సూచనలు చేయిస్తారు. తిరిగి అధికారులు వెళ్లాక పరిస్థితి అలాగే ఉంటుంది. స్థానికులు, రోడ్లపై ట్రాఫిక్ జాంలో ఇరుక్కున్న వారు ట్రాఫిక్ పోలీసులకు ఫోన్ చేస్తే స్పందించరు. మోండా, రాణిగంజ్, పార్కులైన్, ప్యారడైజ్, సుభాష్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు ఇలా ప్రతి ఏరియా అసోసియేషన్ల నుంచి మామూళ్లు ముడుతున్నాయని పలువురు వాపోతున్నారు.

ఇక్కడ నిత్యం ట్రాఫిక్ జాంలే..

అల్ఫాహోటల్, రాణిగంజ్, సుభాష్‌రోడ్డు, 31 బస్‌స్టాప్, పాస్‌పోర్ట్ కార్యాలయం, రాష్ట్రపతి రోడ్డు, మోండామార్కెట్ ప్రాంతాల్లో గంటల తరబడి ట్రాఫిక్ జాం ఏర్పడుతున్నది. అల్ఫాహోటల్, రాణిగంజ్ వద్ద నిత్యం వేలాది మంది సందర్శకులు రాకపోకలు సాగిస్తుంటారు. అక్కడ రోడ్లపై ఆటోలను, దుకాణదారులు రోడ్డు సగం వరకు వ్యాపార ఉత్పత్తులు పెడుతుండటంతో అక్కడ పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని, పార్కింగ్ చేయకుండా నివారించాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.

రోడ్డంతా తవ్వారు.. మరమ్మతులు మరిచారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తోడవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. తార్నాక డివిజన్ లాలాపేటలోని వివేకానంద చౌక్ రోడ్డులో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట మున్సిపల్ అధికారులు సీసీ రోడ్డు నిర్మాణానికి రోడ్డంతా తవ్వారు. అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేని కారణంగా కాంట్రాక్టర్ ఇష్టారీతిన తవ్వకం పనులు చేపట్టాడు. రోడ్డు కింద ఉన్న డ్రైనేజీ పైపులైన్లు, తాగునీటి కనెక్షన్లు ధ్వంసమయ్యాయి. వారం రోజులుగా డ్రైనేజీ నీరు తవ్వీన రోడ్డుపై పొంగిపొర్లుతోంది. రోడ్డంతా బురదమయంగా మారి, దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డులో వెళ్లే ప్రజలతో పాటు స్థానికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందికి ఫిర్యాదు చేస్తే ఎవరి లైన్ వారు మరమ్మతులు చేసుకోవాలని ఉచిత సలహా ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేసి, రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సాధనికులు కోరుతున్నారు.

లాలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట డ్రైనేజీ నీటితో బురదమయంగా మారిన రోడ్డు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్ :సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కార్పొరేటర్ హేమ బుధవారం సందర్శించారు. పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పిల్లల మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు కార్పొరేటర్. విద్యార్థుల ప్లేట్‌లోని భోజనాన్ని రుచి చూశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి.. పిల్లలకు పౌష్టిక ఆహారం అందేలా చూడాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటలు వినాలని, లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్‌కి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి, స్టాఫ్ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

మధురానగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ మూడో అంతస్తు నిర్మాణ పనులను కార్పొరేటర్ హేమ పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 40 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. శుభకార్యాలకు ఫంక్షన్ హాల్ బుక్ చేసుకున్నవారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శైలందర్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

జోశ్యుల మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఘంటసాల 102 జయంతిని పురస్కరించుకొని బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను సన్మానించారు. వడ్లకొండ వెంకట్‌రావు, వెంకట్రావు, రమాశంకర్, విజయలక్ష్మి, పి.అన్నపూర్ణ, సుధారాణి, రామ్ ద్రోణంరాజు, జోశ్యులు రామకృష్ణ శర్మ, భారతి, సీత పాల్గొన్నారు.

- ముషీరాబాద్

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ – 24 పోటీల్లో టీవీవే తైక్వాండో అకాడమికి చెందిన అక్షయ తైక్వాండో గ్రాండ్ చాంపియన్ షిప్ కప్ సాధించారు. పూంసె, క్యోరుగీ విభాగంలో టీవీకే తైక్వాండో అకాడమి విద్యార్థులు రెండు బంగారు, రెండు సిల్వర్ పతకాలు సాధించారు. కరాటే గ్రాండ్ మాస్టర్ కంటే సత్యశంకర్ పతకాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో టీవీకే తైక్వాండో అకాడమి ఫౌండర్ వేణుకుమార్ పాల్గొన్నారు.

- ముషీరాబాద్

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

చాచానెహ్రూ నగర్‌లో మొదలైన తాగునీటి పైపులైన్ల ఏర్పాటు పనులు

బన్సీలాల్‌పేట్ : చాచా నెహ్రూనగర్‌లోని డబుల్‌బెడ్ రూం ఇండ్ల కాలనీలో నూతన తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులను బుధవారం ప్రారంభించారు. లబ్ధిదారుల కోరిక మేరకు నీటి సరఫరా మెరుగు పరచడానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నిధులను మంజూరు చేశారు. సాంకేతిక ప్రక్రియ పూర్తి అయ్యాక, వాటి పనులను మొదలుపెట్టారు. డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కే లక్ష్మీపతి, నర్సింగ్‌రావు, భీమ్‌రావు, కృష్ణ, రమేశ్, మురళి పనులను పరిశీలించారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే తలసానికి వారు ధన్యవాదములు తెలిపారు.

గండి మైసమ్మ ఆలయంలో పూజలు

కంటోన్మెంట్ ఒకటో వార్డు న్యూ బోయిన్‌పల్లి చిన్న తోకట్ట గండి మైసమ్మ ఆలయంలో బుధవారం పూజలు, హోమం నిర్వహించారు. బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండల్ యాదవ్, ముఖేశ్ యాదవ్, అరుణ్ యాదవ్, గోపాల్, జాజుల క్రాంతి, రాజేశ్, జంగిలి రాజు, యాదయ్య పాల్గొన్నారు.

- బొల్లారం

విగ్రహ పున:ప్రతిష్ఠాపన

కంటోన్మెంట్ బోయిన్‌పల్లి శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో బుధవారం విగ్రహ పున:ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

- బొల్లారం

ఎంఈడీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఓయూ పరిధిలోని ఎంఈడీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎండీహెచ్ఎం పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షా ఫీజును ఈ నెల 9 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను నెలలోనే నిర్వహించనున్నటు, పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

7న విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక

కాచిగూడ : విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 7న రామంతాపూర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. వివరాల కోసం 9848199744, 9491888266 లో సంప్రదించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బన్సీలాల్‌పేట్ : విద్యార్థులందరూ తమ దృష్టిని విద్యపైనే ఉంచాలని, వీలైనంతవరకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రి అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 8,9,10 వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కొత్త పద్ధతుల్లో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్ట్‌ల పలు సంగతుల వివరాలు చెప్పారు. వాటి బారిన పడకుండా సెక్యూరిటీ పద్ధతులను ఎలా అవలంభించాలో తెలిపారు. సెల్‌ఫోన్‌లో వచ్చే లింక్‌లను తెరిచి, సైబర్ నేరస్తుల వలలో చిక్కి లక్షల రూపాయలను నష్టపోతున్న విధానాలు ఆమె వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన పోలీసు అధికారులు

సంఘీభావ సభలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ జాతీయ కమిటీ సభ్యులు బాగయ్య

బంగ్లాదేశ్ ప్రభుత్వానిది.. ప్రేక్షకపాత్ర

చిక్కడపల్లి : బంగ్లాదేశ్‌లో హిందువులపై నరమేధం సాగుతున్నా.. ప్రేక్షక పాత్ర వహిస్తుందని ఆర్ఎస్ఎస్ జాతీయ కమిటీ సభ్యుడు బాగయ్య మండిపడ్డారు. హిందూ ఐక్య వేదిక (భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి) ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ హిందూవులకు మద్దతుగా బుధవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సంఘీభావ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ జాతీయ కమిటీ సభ్యుడు బాగయ్య హాజరయ్యారు. అంతర్జాతీయ సమాజం ముందుకు వచ్చి ఒత్తిడి తేవాలని కోరారు. ఇస్కాన్ స్వామి చిన్మోయ్‌కృష్ణదాస్ జీని విడుదల చేయాల న్నారు. వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చినజీయర్ స్వామి ఆశ్రమం ఉత్తరాధికారి దేవనాథ జీయర్ స్వామి, స్వామి నారాయణ నీలకంఠం విదాయపీట్ కు చెందిన హరిదర్శన్ స్వామిజీ, స్వామి దుర్గానందపూరి స్వామిజీ, బనారస్ బాబు స్వామీజీ, ఎమ్మెల్యే రాజాసింగ్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి, సుందర్ రెడ్డి, వీహెచ్‌పీ నాయకులు రామరాజు పాల్గొన్నారు.

ఇండ్లు కూల్చివేత.. న్యాయం చేయాలని డిమాండ్

చిక్కడపల్లి, డిసెంబర్ 4 : గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద నగర్ బస్తీకి చెందిన 19 దళిత కుటుంబాల ఇండ్లను గత జనవరి 29 నాడు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. బాధితులు తమకు న్యాయం చేయాలని నిరసన చేపడుతూనే ఉన్నారు. ప్రభుత్వ ఉన్నాతాధికారులకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. కానీ ఫలితం లేదు. జీహెచ్ఎంసీ అధికారులు వివేకానంద నగర్ బస్తీలో బుధవారం పోలీసుల బందోబస్తు నడుమ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఢబాధితులు ఇందు, పద్మవతి, ఎల్సమ్మ, పూజ, సువర్ణ, సంపత్‌కుమార్, వసంత్‌కుమార్, సాయి, రామ్, ఉమాదేవి మాట్లాడుతూ.. 70 ఏండ్లుగా ఇక్కడ ఉన్నామని, కరెంట్, ట్యాక్స్ అన్నికట్టామని తెలిపారు. అయినా సంవత్సరం కిందట తమ ఇండ్లు ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. సంవత్సరం అవుతున్న తమకు న్యాయం చేయలేదని వాపోయ్యారు. తమకు మరో చోట ఇండ్లు ఇచ్చిన తర్వాత రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు.

కాగా బస్తీ వాసులు కొందరు న్యాయం కోసమే మంగళవారమే ఢిల్లీలో ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వాన్‌కు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ తదితరులు బాధితులకు మద్దతు తెలిపారు. బాధితులకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గుండి కృష్ణ మాదిగ, ఎల్లయ్య మాదిగ, దశరథ్ మాదిగ, కొండపల్లి శివకుమార్ మాదిగ, నీలయం యాదగిరి మాదిగ, కుండే రామ్ మాదిగ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బాధితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

'అరుణోదయ సభలు జయప్రదం చేయండి'

సభ కరపత్రం ఆవిష్కరిస్తున్న విమలక్క, జయధీర్ తిరుమలరావు

ఉస్మానియా యూనివర్సిటీ : అరుణోదయ 50 వసంతాల సభలను విద్యార్థులు, యువకులు, కవులు, కళాకారులు, మేధావులు, కర్షకులు, కార్మికులు జయప్రదం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సభలను 14, 15 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సభకు సంబంధించిన కరపత్రాలను ఓయూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా బుధవారం ఆవిష్కరించారు. ప్రొ. జయధీర్ తిరుమలరావు, విమలక్క మాట్లాడుతూ.. అరుణోదయ పురుడుపోసుకున్న ఇంజినీరింగ్ కళాశాలలో సభ కరపత్రం ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కట్టా భగవంతరెడ్డి, మల్సూర్, రమేశ్ పోతుల, అల్లూరి విజయ్, ప్రభాకర్, రాకేశ్, నాగిరెడ్డి, యలవర్తి ధనలక్ష్మి, మోత్కూరి శ్రీను, రామసత్తన్న, బండి సాయన్న, రాము పాల్గొన్నారు.

6న సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

మాట్లాడుతున్న నూతన పాలక మండలి సభ్యుడు వెంకటేశ్వర్లు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 4 : శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పాలక మండలి నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని 6వ తేదీన ఆలయ ఆవరణలో నిర్వహించున్నట్లు నూతన పాలక మండలి సభ్యుడు రేపాల వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో విలేకర్ల సమావేశంలో నూతన పాలక మండలి సభ్యుల పేర్లను వెల్లడించారు. సభ్యులుగా పి. నర్సింగ్‌రావు, ఎం. రాంమోహన్, కె. పరమేశ్, కె. పద్మజ, పి. బాల్‌రాజ్, పి. శ్రీనివాస్, ఎక్స్ ఆఫిషియల్ సభ్యుడు టి. రాజేశ్వర శర్మ పేర్లు ప్రకటించారు. సభ్యుల ప్రమాణ స్వీకారం రోజునే ఆలయ చైర్మన్ ఎంపిక ఉంటుందని తెలిపారు.